క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వివిధ పార్టీల కార్యకర్తలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరికృష్ణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల ఊరేగింపు



బోనాలను తీసుకెళ్తున్న ప్రజలు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈనెల 30న జరిగే రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం గ్రామ దేవతలైన పోషమ్మ, మహంకాళి అమ్మవార్లకు డప్పు చప్పుళ్లు, బైండ్ల వారి ఆట పాటలు, శివసత్తుల పూనకాలతో భారీ ఊరేగింపుగా మహిళలు బోనాలను తీసుకెళ్లి సమర్పించారు.

చెక్కులు పంపిణీ

దుబ్బాక: పేద ప్రజలకు సీఎంఆర్ఎఫ్ వరమని బీజేపీ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ అన్నారు. బుధవారం దుబ్బాక పట్టణంలో ని 14,15 వార్డులకు చెందిన పలు బాధిత కుటుంబాలకు ఎంపీ రఘునందన్ రావు ఆదేశాల మేరకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దిశ కమిటీ మెంబర్ ప్రవీణ్‌చారి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్, కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, యాదగిరి, భరత్, మనోజ్‌గౌడ్ ఉన్నారు.

కార్యకర్తలు తరలి రావాలి

ములుగు(గజ్వేల్): ఈ నెల 31న వరంగల్ రానున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు స్వాగతం పలికేందుకు గ్రామాల నుంచి కార్యకర్తలు భారీగా తరలి రావాలని జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు బుడిగె మహేష్ పిలుపు నిచ్చారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకున్న మంద కృష్ణ మాదిగ 31న ఉదయం 10 గంటలకు వరంగల్ చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్‌పాల్గొన్నారు.

దేశ భక్తికి ప్రతిరూపం సావర్కర్



సావర్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

సిద్దిపేటజోన్: దేశ భక్తికి ప్రతిరూపం వీర సావర్కర్ అని పట్టణ బీజేపీ అధ్యక్షుడు వెంకట్ అన్నారు. సావర్కర్ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన జీవిత కాలాన్ని జైలులో గడిపిన గొప్ప స్వాతంత్ర్య వీరుడుగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంతోష్, శ్రీనివాస్, నరేష్, సునీల్, వేణు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

సిద్దిపేటకమాన్: వేధింపులు భరించలేక వివాహిత పురుగుల మందు తాగి మృతి చెందింది. వన్ టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లికి చెందిన నర్ర మౌనిక (25) నంగునూర్ మండలం గట్లమల్యాలకు చెందిన శ్రీకాంత్‌తో 2021లో వివాహం జరిగింది. ఏడాదిపాటు వారి కాపురం సజావుగా సాగింది. తర్వాత భర్త, అత్తమామలు అదనపు కట్నం కావాలని మౌనికను వేధించారు. అయితే మహిళ పోలీసు స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించినా వారి తీరు మారలేదు. ఈ క్రమంలోనే గతనెల 29న మౌనిక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. బుధవారం ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది.

గతుకు జీవుడా..!

అధ్వానంగా వర్గల్ ప్రధాన రోడ్డు

- బోల్తా పడుతున్న వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



గుంతలను పూడ్చివేయిస్తున్న పంచాయతీ సిబ్బంది

వర్గల్(గజ్వేల్): రెండో బాసరగా పేరొందిన విద్యా సరస్వతి క్షేత్రంతో వర్గల్ ఖ్యాతి రాష్ట్ర, దేశస్థాయిలో ఇనుమడించింది. వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక వాడ రూపుదిద్దుకుంటున్నది. నవోదయ విద్యాలయం ఇక్కడే ఉన్నది. రాజీవ్ రహదారి నుంచి జాతీయ రహదారికి వర్గల్ రోడ్డే అనుసంధానంగా నిలుస్తున్నది. ఈ క్రమంలో నిత్యం వేలాది వాహనాలు వర్గల్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ గుంతలు, తాత్కాలిక ప్యాచ్‌లతో ఈ రోడ్డు వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది.

అడుగడుగునా గుంతలు..కల్వర్టులు కనుమరుగు

వర్గల్ మండల కేంద్రంలో జూనియర్ కాలేజీ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు వర్గల్ ప్రధాన రోడ్డుపై చాలా చోట్ల గుంతలే దర్శనమిస్తున్నాయి. వర్షం పడితే గుంతలను గుర్తించక ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్‌లాంటి పెద్ద వాహనాలు సైతం బోల్తా పడుతున్నాయి. వర్షం వస్తే అంబేద్కర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం, జూనియర్ కాలేజీ దాకా వరద ప్రవాహంతో రోడ్డు చెరువును తలపిస్తోంది. గతంలో ఎగువ నుంచి వచ్చే వరద నీరు దిగువకు వెళ్లేందుకు కల్వర్టులు ఉండేవి. ఇప్పుడు అవి ఉనికిని కోల్పోయాయి. దీంతో వరద నీరంతా రోడ్డుపై ప్రవహిస్తుండటంతో రోడ్డు దెబ్బతిని భారీ గోతులేర్పడుతున్నాయి. ఆర్అండ్‌బీ శాఖ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



వర్గల్ ప్రధానరోడ్డుపై చెరువును తలపిస్తున్న నీటిలో ద్విచక్ర వాహనదారుడి పాట్లు (ఫైల్)

నామమాత్రంగా మరమ్మతులు

రోడ్డు దెబ్బతిని గుంతలేర్పడ్డ చోట గ్రామపంచాయతీ సిబ్బంది సిమెంట్, కంకర డస్ట్ వేయించి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. వర్షం పడితే పరిస్థితి మళ్లీ మొదటికే వస్తోంది. సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎగువ నుంచి వచ్చే వరదకు తారు రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో రోడ్డుపై వాహనదారులు సర్కస్ ఫీట్లు చేయక తప్పడం లేదు. ఇటీవల ధాన్యపులోడ్‌తో వెళ్తున్న ఓ ట్రాక్టర్ గుంతలో అదుపుతప్పి బోల్తాపడిన విషయం తెలిసిందే. ఇక్కడ సీసీ రోడ్డు నిర్మిస్తేనే సమస్య తొలగిపోతుందని స్థానికులు పేర్కొంటున్నారు.



రెండురోజుల క్రితం గుంతల్లో బోల్తాపడిన ట్రాక్టర్

సీసీరోడ్డు నిర్మించాలి



వర్గల్ మండల కేంద్రంలోని ఎమ్మార్వో, ఎంపీడీఓ ఆఫీసు, సర్కారు దవాఖానకు వెళ్లే రోడ్డును ఎవరూ పట్టించుకుంటలేరు. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలతోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నరు. అప్పుడప్పుడు గుంతలు పూడుస్తున్నరు. నాలుగు రోజులకు రోడ్డుపై మళ్లీ గుంతలు ఏర్పడుతున్నయ్. సీసీ రోడ్డు వేస్తే గుంతల బాధ తప్పుతది. జనానికి ఇబ్బందులు పోతయ్.

–కనకయ్య (మైలారం)

మరమ్మతులు చేస్తున్నాం..



భారీ వర్షాలు, వరదలకు వర్గల్ మెయిన్‌రోడ్డుపై తారు దెబ్బతిని గుంతలేర్పడుతున్నాయి. అందులో వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయి. గతంలో అనేకసార్లు గుంతలు పూడ్చివేయించినం. తాజాగా ఏర్పడిన గుంతలను సైతం ప్రజల ఇబ్బందుల దృష్ట్యా సిమెంట్, డస్ట్ కంకరతో పూడ్చివేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాం.

– సందీప్ (పంచాయతీ కార్యదర్శి, వర్గల్)

ధాన్యం కొనుగోళ్లలో గోల్‌మాల్

- డబ్బులు చెల్లించేందుకు అంగీకారం
- విచారణ పూర్తి చేసిన అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాల ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు ధాన్యం సేకరణలో కాంటాల్లో బస్తాకు అదనంగా ఒక కిలో వచ్చే విధంగా సెట్ చేసి రైతులను మోసం చేశారు. బుధవారం అధికారులు చేసిన విచారణలో తేలింది. మొత్తం కొనుగోలు కేంద్రంలో 21,781 ధాన్యం బస్తాలను కొనుగోలు చేశారు. ఒక్క బస్తాకు ఒక్క కిలో చొప్పున 217 క్వింటాళ్ల 81 కిలోల ధాన్యం పక్క దారి పట్టగా దాని విలువ రూ.5,05, 320 రైతులకు చెల్లించేందుకు నిర్వాహకులు అంగీకారం తెలిపారు. వాటిని మధ్యవర్తి ద్వారా నెలరోజుల్లో చెల్లించేందుకు నిర్వాహకులు ఒప్పుకోవడంతో రైతులు శాంతించారు. దీంతో కొనుగోలు కేంద్రంలో జరిగిన అక్రమాలపై విచారణ పూర్తయ్యిందని నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ విచారణలో రైతులు ,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ రెడ్డి

మహిళల ఆరోగ్య రక్షణకు ‘రుతు ప్రేమ’



కొమురవెల్లి : గురువన్నపేటలో అవగాహన కల్పిస్తున్న పంచాయతీ కార్యదర్శి కరుణాకర్

కొమురవెల్లి(సిద్దిపేట): స్త్రీ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుపడుతుందని గురువన్నపేట పంచాయతీ కార్యదర్శి కరుణాకర్ అన్నారు. బుధవారం అంతర్జాయ రుతు దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలోని మహిళలకు రుతు ప్రేమపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు రుతు క్రమం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, బాలికలు, అంగన్‌వాడి టీచర్లు, ఆశావర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రుతు పరిశుభ్రతపై అవగాహన

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ రుతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవగాహన కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం జ్యోతి, అంగన్వాడీ టీచర్‌లు యాకమ్మ, దుర్గలత, ఆశ కార్యకర్తలు, సీఏలు, మమత, తబుసుమ్ పాల్గొన్నారు.

రుతుప్రేమను స్వాగతిద్దాం..

అక్కన్నపేట(హుస్నాబాద్): మానవ మనుగడను శాసించే పవిత్రమైన ప్రక్రియ రుతుచక్రమని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) దేవకీ దేవి అన్నారు. అంతర్జాతీయ రుతు పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక రైతు వేదికలో రుతుప్రేమపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మహిళలు బాగుంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

టీబీ రహిత జిల్లాగా కృషి

డీఎంహెచ్ఓ డాక్టర్ పల్వన్‌కుమార్

సిద్దిపేటకమాన్: టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పల్వన్‌కుమార్ తెలిపారు. బుధవారం జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట నాసర్‌పూర అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రాలకు, బస్తీ దవాఖానలకు వచ్చే వారికి, క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారికి వైద్య సిబ్బంది స్క్రీనింగ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ పల్వన్‌కుమార్

ఆర్అండ్ఆర్ కాలనీ పరిశీలన

ములుగు(గజ్వేల్): కోల్ ఇండియా నుంచి వచ్చిన ఉద్యోగులు అధ్యయన పరంగా బుధవారం ములుగు మండలంలోని మామిడ్యాల, బహిలంపూర్, తానెదార్‌పల్లి ఆర్అండ్ఆర్ కాలనీలను సందర్శించారు. కాలనీలలో నిర్వాసితుల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను, వసతులను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ములుగు డిప్యూటీ తహసీల్దార్ భవానీ కాలనీల నిర్మాణం చేపట్టిన విధానం గురించి వివరించారు.

ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేయాలి

ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బాలశౌరి

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రతి ఒక్క రైతు ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులు పాటించి సాగు చేయాలని లోడి సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బాలశౌరి అన్నారు. మండలంలోని దాదాపు 23 గిరిజన తండాల్లో మానోస్ యూనిదాస్ సహకారంతో గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వర్మీ కంపోస్టు, గొర్రె ఎరువు, నల్లరేగడి మట్టి తదితర లాంటి వాటిని భూముల్లో పోసుకోవాలని సూచించారు. అలాగే రసాయన ఎరువులను తగ్గించాలన్నారు. కార్యక్రమంలో మండల ఫీల్డ్ కో–ఆర్డినేటర్ సత్యనారాయణ, కనకం, రవీందర్, బిచ్చ, తిరుమల , రమేష్ పాల్గొన్నారు.

బియ్యం పంపిణీలో ఇబ్బందులుండొద్దు..

బెజ్జంకి(సిద్దిపేట): వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం 3 నెలల రేషన్ బియ్యం జూన్ నెలలో ఒకేసారి పంపిస్తున్నందున ప్రజలకు పంపిణీలో ఇబ్బందులు లేకుండా చూడాలని తహసీల్దార్ చంద్ర శేఖర్ రేషన్ డీలర్లకు సూచించారు. బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టాక్ నిల్వ చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎక్కడ కూడా బియ్యం వర్షాలకు తడవకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. దుర్వినియోగం జరుగకుండా లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మండల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

–రూ.8,380, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం

చేర్యాల(సిద్దిపేట): ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ప్రొబేషనరీ ఎస్ఐ సమత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ పట్టణ కేంద్రంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు వెళ్లి రైడ్ చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.8,380 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన గేము నాయక్



కలెక్టర్ మను చౌదరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న గేమునాయక్

సిద్దిపేటరూరల్: రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (ఆర్ఎస్ఈటీఐ) డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన గేము నాయక్ బుధవారం కలెక్టర్ మను చౌదరిని మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో బ్రాంచ్ మేనేజర్‌గా విధులు నిర్వహించిన గేమునాయక్ పదోన్నతిపై ఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అనంతరం అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌ను కలిశారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం

- ఎమ్మెల్సీ అంజిరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దామని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన బడిబాట ప్రచార జాతను బుధవారం డీఈవో శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం కోసం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు కృషి చేయాలన్నారు. కార్పొరేట్ స్థాయి విద్య అందుతుందని, విద్యార్థులకు ఇంగ్లిష్‌లో బోధిస్తున్నారని తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్.. పాఠశాలల బలోపేతం కోసం ప్రచార యాత్రను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ వలీ, కార్యదర్శి యాదగిరి, అర్బన్, రూరల్ ఎంఈవోలు ప్రభాకర్ రెడ్డి, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బడిబాట ప్రచార జాతను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తి చేయండి



ఆర్అండ్‌బీ డీఈ నరేందర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న లబ్ధిదారులు, బీజేపీ నాయకులు

హుస్నాబాద్: మూడేళ్లుగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని లబ్ధిదారులతో కలిసి బీజేపీ నాయకులు బుధవారం ఆర్అండ్‌బీ డీఈ నరేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం పట్టణ శివారులో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి 96 మందికి లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారన్నారు. కానీ కనీస సౌకర్యాలు కల్పించకుండా వదిలేశారన్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్ర ం అందజేసిన వారిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, నాయకులు అనంతస్వామి, రాంప్రసాద్, రాజేందర్, లబ్ధిదారులు శారద, ఆనంద్, పద్మ, రుక్మవ్వ, శారద, రాధ, రవళి ఉన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ బడుల్లోనే విజ్ఞానవంతమైన చదువు ఉంటుందని, పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపి సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని ఎంఈఓ దోమకొండ అంజాగౌడ్ కోరారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డి పల్లిలో బుధవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి బడిబాటకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదివే ప్రతి విద్యార్థికి యూనిఫామ్, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు, అంబలి అందిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు ఖర్చు చేసే డబ్బులను కుటుంబ అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమార స్వామి, గ్రామ పంచాయతీ కార్యదర్శి గణేష్, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, కవిత, రేణు మానస, అంగన్‌వాడీ టీచర్లు సుశీల, యాదమ్మ, ఏఎంలు పాల్గొన్నారు.



బడిబాట కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ అంజాగౌడ్

తెలుగు సాహిత్య కృషీవలుడు సురవరం



సురవరం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలుగు సాహిత్య కృషీవలుడు సురవరం ప్రతాపరెడ్డి అని, జాతీయ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఎన్నవెల్లి రాజమౌళి పేర్కొన్నారు. సురవరం ప్రతాపరెడ్డి జయంతిని బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కవులే లేరనే వ్యాఖ్యలను సవాలుగా తీసుకొని, 354 కవులతో కూడిన గోల్కొండ కవుల సంచిక గ్రంథాన్ని కవుల జీవిత విశేషాలతో సహా సమాధానమిచ్చిన వైతాళికుడు సురవరం అని పేర్కొన్నారు. పత్రిక సంపాదకులుగా, కవి, రచయిత, సామాజిక చైతన్యకారులుగా ఎనలేని సేవ చేసిన గొప్ప సాహితీవేత్త సురవరం అని కొనియాడారు. నేటి కవులు, రచయితలు ఆయన బాటలో పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో కవులు ఉండ్రాళ్ల రాజేశం, బస్వరాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు


జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ లింగమూర్తి

అక్కన్నపేట(హుస్నాబాద్): మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. మండల కేంద్రంలో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర కార్యక్రమంలో భాగంగా రైతు వేదికలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని మహిళలు నినాదాలు చేస్తూ రైతు వేదిక వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆ దిశగా ప్రతి ఒక్క తల్లిదండ్రులు తమ తమ పిల్లలపై నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ భానోతు జయరాం, నాయకులు వీరన్న యాదవ్, ముత్యాల సంజీవ్‌రెడ్డి, చెప్యాల ప్రకాశ్, వేముల జగదీశ్, తొందూరు ఎల్లయ్య, రమేష్, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, సీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి

పాఠ్య పుస్తకాలు అందజేత



పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు

దౌల్తాబాద్(దుబ్బాక): దౌల్తాబాద్ మండల వనరుల కేంద్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలను బుధవారం అందజేశారు. జూన్ మొదటి వారంలోనే విద్యార్థులకు అందించాలన్న నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తుగానే పాఠశాలలకు అందజేసిందని మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, రామకృష్ణారెడ్డి, సుధాకర్ ,సీఆర్పీలు రాజు, చంద్రమౌళి, నగేష్, మండల వనరుల సిబ్బంది శేఖర్, పెంటయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడిలో అక్కాచెల్లెళ్లకు జ్యూరీ అవార్డులు

బెజ్జంకి(సిద్దిపేట): ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా చిలుకలూరిపేటలో జాతీయ స్థాయి నవరస జానపద, సంగీత, నాట్య కళలపై కళానిలయం సంస్థ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు అయిన పురుషోత్తం ఆరుషి, అయాన్షిలకు కూచిపూడి విభాగంలో జ్యూరీ అవార్డులు ప్రదానం చేశారు. ఈనెల 24 నుంచి జరిగిన పోటీల్లో అక్కాచెల్లెళ్లు ఇద్దరూ కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబర్చారు. ఇందుకుగాను అవార్డులను సంస్థ ప్రతినిధులు అందించారని వారి తల్లిదండ్రులు పురుషోత్తం రజిత, శ్రీకాంత్ తెలిపారు.



జ్యూరీ అవార్డులు అందుకుంటున్న ఆరుషి, అయాన్షి